సాక్షి
జనగామ

గురువారం । 2 । మే । 2024



తస్మాత్ జాగ్రత్త!
ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ ప్రచారాలకు దూరంగా ఉండాలి. లేదంటే ఈసీ వారిపై కఠిన చర్యలు తీసుకుంటుంది.
- IIలో▸



నేలకొరిగిన 'విప్లవ' కెరటం
ఓ విప్లవ కెరటం నేలకొరిగింది. బుధవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా టెక్మెట్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు సుష్మిత మృతి చెందింది.
- IIలో▸



వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి



స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు అవకాశం కల్పించకుండా ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ అన్నారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ అవకాశవాది అయిన కడియం శ్రీహరి స్వార్థం కోసం మాదిగలను ఎదగనీయకుండా అణచివేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్టానం పార్టీ సభ్యత్వం లేని కావ్యకు టికెట్ ఇచ్చి 80 లక్షల మంది మాదిగలకు ద్రోహం చేసిందన్నారు. మాదిగల భవిష్యత్ బీజేపీతోనే సాధ్యమని, ప్రధాని నరేంద్రమోదీకి మాదిగ జాతి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పుట్ట రవి, చాడ ఏలియా, గాదె శ్రీధర్, రడపాక ఆదాం, మహేందర్, రవీందర్, కుమార్, అశోక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొమురెల్లి



రఘునాథపల్లి: కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధి కుసుంబాయితండాకు చెందిన గుగులోతు కొమురెల్లి నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, మేకల నరేందర్, మాసంపల్లి లింగాజీ, లింగా సుభాష్‌చందర్‌రెడ్డి, కోళ్ల రవిగౌడ్, సునావత్ సుమన్, కొంకిస్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరోగమన దిశలో మోదీ ఆర్థిక విధానాలు

కేయూ క్యాంపస్: తిరోగమన దిశలో మోదీ ఆర్థిక విధానాలు ఉన్నాయని రాష్ట్ర ప్రజాసంఘాల చైర్మన్ కె.వెంకటనారాయణ అన్నారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రంలో 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై కరపత్రాన్ని ప్రజాసంఘాల రాష్ట్ర వైస్ చైర్మన్, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అధ్యక్షతన వెంకటనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ముందు చూపు లేనితనంతో సగటు మనిషి బడ్జెట్ తలకిందులై పేదలు నిరుపేదలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ ఓబీసీల కులగణన చేయకుండా కేంద్రప్రభుత్వం తాత్సారం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ గునిగంటి శ్రీనివాస్, 'పాస్' రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, బాధ్యులు డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ వంగల సుధాకర్, బిక్కునాయక్, డాక్టర్ సుదయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్ సరెండర్

ఎంజీఎం: హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ జిలకర రమేష్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య పర్యవేక్షకులు జిలకర రమేష్‌పై వచ్చిన పలు ఆరోపణలపై నోటీసులు జారీ చేయగా సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. రమేష్ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయని, ఆధారాలతో సహా మెమో రూపంలో సమర్పించినప్పటికీ స్పందించకపోవడంతో ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న కేసీఆర్, పక్కన మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి కవిత, సత్యవతి రాథోడ్, శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్



నృత్యం చేస్తున్న సత్యవతి రాథోడ్



మానుకోటలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జన సందోహం

జనసంద్రంగా మారిన మానుకోట
- పోటెత్తిన ప్రజలు.. వీధులన్నీ గులాబీమయం
- బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు నీరాజనం
- ప్రసంగంలో తరచూ మానుకోట ప్రస్తావన
- ఈలలు, కేరింతలు, చప్పట్లు కొట్టిన ప్రజలు
- 15 నిమిషాలపాటు సాగిన ప్రసంగం
- ఆకట్టుకున్న మాజీ మంత్రి సత్యవతి నృత్యం

నాలుగుదారులు జనమే.. జనం

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొదటిసారి కేసీఆర్ మానుకోటకు వచ్చారు. దీంతో జిల్లా నలుమూలలతోపాటు నర్సంపేట, ములుగు, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు, అభిమానులతో మానుకోట వీధులు పోటెత్తాయి. ఇందిరాగాంధీ చౌరస్తాకు నలుదిశలా జనాలు కిక్కిరిసిపోయారు. 'నేల ఈనిందా.. అన్నట్లు ప్రజలు రావడం సంతోషంగా ఉందని.. ఇదే స్ఫూర్తితో ప్రచారం ముమ్మరం చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

గులాబీ కోట..!

మహబూబాబాద్: గులాబీ బాస్ కేసీఆర్ రాకతో మానుకోట వీధులు జనసంద్రమయ్యాయి. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ సాగిన ప్రసంగం పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నింపింది. భద్రాద్రి కొత్తగూడెంనుంచి టేకులపల్లి, ఇల్లెందు, బయ్యారం మీదుగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బుధవారం రాత్రి మానుకోటకు చేరుకున్నారు. జిల్లా కేంద్రం ఇల్లెందు రోడ్డులో కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆర్వోబీ మీదుగా బంధం చెరువు సమీపంనుంచి అండర్ బ్రిడ్జి, నెహ్రూసెంటర్ మీదుగా ఇందిరాగాంధీ సెంటర్‌కు చేరుకున్నారు. దారి పొడవునా కార్యకర్తలు, నాయకులు ప్రజలు గులాబీ పూలు చల్లుతూ నీరాజనం పలికారు. కేసీఆర్ తన ప్రసంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోట జిల్లాను రద్దు చేస్తుందనీ.. జిల్లా ఉండాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలన్నారు. మానుకోట మారుమూల గిరిజన ప్రాంతమని జిల్లాగా ఏర్పాటు చేశామంటూ పలు విషయాలు ప్రస్తావించారు. ఎంపీ అభ్యర్థి కవిత మంచిగా పనిచేస్తుంది.. ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడుతుందని కితాబు ఇచ్చారు.. అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ మెడలు వంచాలంటే.. కవితను గెలిపించాలని కోరుతూ.. ప్రజల నుంచి సమాధానం రాబట్టారు. అదేవిధంగా గిరిజనులు, ఆదివాసీలు ఉన్న ఈ ప్రాంతానికి బీఆర్‌ఎస్ ఏం చేసింది.. కాంగ్రెస్ ఏం చేయలేదు.. అనే విషయాన్ని చర్చకు వచ్చే విధంగా వివరించారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ పెంపు, సేవాలాల్ మహరాజ్ గిరిజన భవన్ నిర్మాణం మొదలైన విషయాలు ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై అన్నదాతలకు రైతుబంధు, రైతుబీమా తదితర విషయాలపైనే ఎక్కువగా ప్రసంగించా రు. రోడ్ షోకు హాజరైన ప్రజలు ఈలలు, కేరింతలు కొడుతూ కనిపించారు. ప్రసంగం ముగించాక జనానికి విజయ సంకేతం చూపించి బస్సులోపలికి వెళ్లారు. ఆ తరువాత బస్సుపై పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ నృత్యం చేశారు. కార్యకర్తలు అదేరీతిలో అభివాదం, నృత్యాలు చేస్తూ జోష్‌లో కనిపించారు.

జిల్లా ఉండాలంటే బీఆర్‌ఎస్‌కు.. లేదంటే కాంగ్రెస్‌కు

ఈ ప్రాంతం ప్రాముఖ్యతను చూసి మహబూబాబాద్‌ను జిల్లాగా చేశా. ఇప్పుడు సీఎం మానుకోట జిల్లాను ఎత్తివేస్తా అంటున్నాడు.. ఎత్తివేయాలా.. ఉంచాలా.. జిల్లా ఉండాలంటే బీఆర్‌ఎస్‌కు మద్దతు చెప్పాలి.. జిల్లాను వద్దు అనుకునే వారైతే కాంగ్రెస్‌కు ఓటు వేయాలి. ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసిన కవితను మరోసారి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీలో దింపాం.. కష్టపడే తత్వం ఆమెకు ఉంది.. కవితకు ఓట్లు వేసి గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

- మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

పర్యటన ఇలా..
- రాత్రి 7.10 గంటలకు బస్సుయాత్ర మానుకోటలోని ఇందిరాగాంధీ సెంటర్‌కు చేరుకుంది.
- ఆ తరువాత ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, డీఎస్ రెడ్యానాయక్, శంకర్‌నాయక్, రేగ కాంతారావు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితోపాటు పలువురు బస్సుపైకి వచ్చారు.
- 7.19 గంటలకు మాజీ సీఎం కేసీఆర్ బస్సుపైకి వచ్చి జనానికి అభివాదం చేశారు.
- 7.20 గంటలకు ప్రసంగం మొదలుపెట్టారు. ● 7.35 గంటలకు ప్రసంగం ముగించారు.

పీఓలు, ఏపీఓల పాత్ర కీలకం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: ఎన్నికల నిర్వహణలో పీఓలు, ఏపీఓల పాత్ర కీలకమైనదని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల విధులు, మాక్‌పోలింగ్, తదితర అంశాలకు సంబంధించి దిశా నిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణపై నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పించినట్లు చెప్పారు. జనగామ నియోజకవర్గంలో 288, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 340 మంది శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. ఎన్నికల రోజు ఉదయం రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని చెప్పారు. ఆర్డీఓ కొమురయ్య, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, తహసీల్దార్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ డీఎస్ వెంకన్న ఆధ్వర్యాన స్థానిక శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లో పీఓలు, ఏపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, అంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్లు విజయ్‌కుమార్, రాజేష్‌కుమార్, హరిప్రసాద్, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

అప్రమత్తంగా వ్యవహరించాలి : అదనపు కలెక్టర్

పాలకుర్తి: ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. బుధవారం పాలకుర్తిలో ఉద్యోగుల నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ వెంకటేశ్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి..

జనగామ రూరల్: పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అదనపు ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీరు, ఇతర అన్ని వసతులు కల్పించాలని చెప్పారు. వీసీలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్ సింగ్, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, జెడ్పీసీఈఓ, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కడియం కావ్యను ఆదరించాలి

దేవరుప్పుల : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను ఆదరించి లక్ష మెజారిటీతో గెలిపించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక అక్షర గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజాపాలన, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. అనంతరం చిన్నమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల సురేష్ బాబు, ధర్మారెడ్డి, గణేష్, నాగరాజు, ఓడపల్లి రవీందర్, టి.పాండుకృష్ణ, యాకస్వామి, వెంకన్న, మాలతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్

జనగామ రూరల్: పని గంటల పోరాటంలో అమరులైన వీరుల స్ఫూర్తిగా కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నారు. మేడేను పురస్కరించుకుని బుధవారం జిల్లా వ్యాప్తంగా వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద అబ్బాస్‌తోపాటు జిల్లా కార్యదర్శి కనకారెడ్డి మాట్లాడుతూ.. నాడు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను నేటి పాలకులు కాలరాస్తున్నారని అన్నారు. దేశ సంపద, శ్రమదోపిడీని ఆపాలని, కార్మికులకు అదనపు విలువ పంపిణీ జరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాపర్తి రాజు, జోగు ప్రకాష్, గోపి, శ్రీనివాస్, దస్తగిరి, వెంకటమల్లయ్య, ఉపేందర్, కల్యాణి, శివలింగం, వెంకటేష్, రజిత, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

సీపీఐ ఆధ్వర్యాన పార్టీ కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి పార్టీ, అనుబంధ సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక ద్రోహి బీజేపీని ఓడించాలన్నారు. ఆకుల శ్రీనివాస్, రాజు, మల్లయ్య వీరస్వామి, యాకూబ్,వివిధ ప్రాంతాల్లో ఏఐటీయూసీ జెండాలు ఆవిష్కరించారు. నాగరాజు, శంకర్. శ్రీనివాస్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీపీఎం నాయకులు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని సంఘం కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండాను రాష్ట్ర కార్యదర్శి కె.రంజిత్‌కుమార్ ఆవిష్కరించారు. ఆగయ్య, జి.కృష్ణ, కనకయ్య, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌జోన్‌లో మూడు మండలాలు



బుధవారం ఉదయం 11 గంటలకు ఆర్టీసీ చౌరస్తాలో..

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు సెల్సియస్ డిగ్రీల్లో..

మండలం	కనిష్ఠం	గరిష్ఠం
జఫర్‌గఢ్	37.9	45.6
చిల్పూరు	37.2	45.6
జనగామ	34.8	45.0
పాలకుర్తి	36.4	44.8
కొడకండ్ల	36.5	44.5
స్టేషన్‌ఘన్‌పూర్	34.2	44.3
లింగాల ఘణపురం	36.2	43.8
దేవరుప్పుల	35.6	43.6
బచ్చన్నపేట	35.8	43.3
రఘునాథపల్లి	35.3	42.6
తరిగొప్పుల	35.1	42.5
నర్మెట	33.3	42.3

- జిల్లాలో 45.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- హై టెంపరేచర్‌లో వాతావరణం

జనగామ: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రెండురోజుల క్రితం జనగామ మండలానికి వార్నింగ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ.. బుధవారం మరో రెండు మండలాలను రెడ్‌జోన్‌గా ప్రకటించింది. ఏసీలు సైతం పని చేయని పరిస్థితిలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఇంటి గోడలు హీటెక్కి.. వేడి లోనకు దూసుకు వస్తున్నది. ఏది ముట్టుకున్నా సుర్రుమంటోంది. గత నెల 30వ తేదీన మొదటి సారిగా జనగామలో 45.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. కొత్తగా చిల్పూరు. జఫర్‌గఢ్‌లో సైతం ఇదే స్థాయిలో నమోదయ్యాయి. ఒక్క ఆర్టీసీ బస్టాండ్లలో తప్ప జన సంచారం ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పటి వరకు ఇతంటి టెంపరేచర్ చూడని జిల్లా ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని హైదరాబాద్, సూర్యాపేట, హనుమకొండ, సిద్దిపేట ప్రధాన రహదారులు, రైల్వేస్టేషన్, నెహ్రూపార్కు ఏరియాలు నిర్మానుష్యంగా మారిపోయాయి. చిల్పూరు, జఫర్‌గఢ్‌లో రికార్డు స్థాయి 45.6, జనగామలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు, అత్యల్పంగా నర్మెటలో 42.3 నమోదైనట్లు వాతా వరణశాఖ వెల్లడించింది.

విద్యను మించిన ఆయుధం లేదు

- వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుముల బాల



మాట్లాడుతున్న డాక్టర్ ఉడుముల బాల

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యను మించిన ఆయుధం లేదు.. విద్య ద్వారా ఏదైనా సాధించవచ్చని వరంగల్ బిషప్ ఫాదర్ డాక్టర్ ఉడుముల బాల అన్నారు. డివిజన్ కేంద్రంలో సీబీఎస్‌ఈ సిలబస్‌తో నూతనంగా ఏర్పాటు చేసిన ఫాదర్ కొలంబో ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ కిరణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఉడుముల బాల మాట్లాడుతూ.. దివంగత ఫాదర్ కొలొంబో ఘన్‌పూర్ నియోజకవర్గంలో నిరుపేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించే దిశగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఘన్‌పూర్‌లో పేద, సామాన్య వర్గాల పిల్లలకు మెరుగైన ప్రాథమిక విద్య అందించే లక్ష్యంగా ఫాదర్ కొలంబో పేరుతో సీబీఎస్‌ఈ సిలబస్‌తో పాఠశాలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే నిర్వహిస్తున్న విద్యాజ్యోతి డిగ్రీ కళాశాలలోనే సీబీఎస్‌ఈ సిలబస్‌తో ఏర్పాటు చేసిన ప్రైమరీ స్కూల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డిప్యూటీ మేనేజర్ ఫాదర్ జయపాల్, ఫాదర్ అగస్టీన్‌రెడ్డి, ఫాదర్ దాసయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించాలి

- విద్యుత్ శాఖ ఎస్‌ఈ వేణుమాధవ్

జనగామ రూరల్: వినియోగదారులకు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆ శాఖ ఎస్‌ఈ టి.వేణుమాధవ్ అన్నారు. మండల పరిధి ఓబుల్‌కేశ్వాపూర్‌లోని సబ్‌స్టేషన్‌ను డీఈ ప్రభావతి, ఏడీఈ వేణుగోపాల్‌తో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు అటెండ్ అవుతున్నప్పుడు, విద్యుత్ అంతరాయం పునరుద్ధరణ పనులు చేస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా జిల్లా పరిధి 77 సబ్‌స్టేషన్లలో అన్ని ఎర్త్ పిట్లను తడపడానికి బోరు బావులు తవ్వించామని, కొత్తగా మరో ఏడు స్టేషన్లకు వేయించడంతో లైన్లలో అంతరాయం వచ్చినపుపడు ట్రిప్ అవుతుందని తెలిపారు. ఓల్టేజీ సమస్యను తగ్గించడానికి కెపాసిటీ బ్యాంక్ ఇన్‌స్టాల్ చేశామన్నారు.

ప్రమాదాలపై అవగాహన అవసరం : డీఈ లక్ష్మీనారాయణరెడ్డి

రఘునాథపల్లి: విద్యుత్ ప్రమాదాలపై అవగాహన అవసరమని, ప్రజలు, సిబ్బందిని చైతన్య పర్చడానికి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీఈ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం రఘునాథపల్లి సబ్ డివిజన్‌లో కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. సీనియర్ అకౌంట్ అధికారి జయరాజు, ఏడీఈ మనోహర్‌రెడ్డి, ఏఈలు రాహుల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఓబుల్‌కేశ్వాపూర్ సబ్‌స్టేషన్‌లో వేణుమాధవ్, ఇతర అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ సబ్‌డివిజన్ కార్యాలయంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై సబ్‌డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో స్థానిక డీఈ ఎం.హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సాల పోస్టర్లను ఆవిష్కరించి పలు సూచనలు చేశారు. ఏడీఈ సత్యనారాయణ, ఏఈలు పులి చంద్రమోహన్, టి.రమేష్, శివకుమార్, కె.విశ్వసాహితి, టెక్నికల్ ఏఈ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కూలి గిట్టుబాటయ్యేలా అవగాహన కల్పించాలి

కొడకండ్ల : జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలు కొలతల ప్రకారం పనులు చేసి ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు కూలి పొందేలా వారికి అవగాహన కల్పించాలని డీఆర్‌డీఓ మొగులప్ప అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో నీడ, మంచి నీరు, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లు అందుబాటులో ఉంచాలని, వచ్చే హరితహారానికి సైట్లు గుర్తించి ఎస్టిమేషన్ వేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి, టీఏ, ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మొగులప్ప

ఇక.. ఈజీ

స్మార్ట్‌ఫోన్‌లో పోలింగ్ కేంద్ర సమాచారం

మీకు తెలుసా..?

- నూతన సంస్కరణలకు ఎన్నికల కమిషన్ శ్రీకారం

కాజీపేట: లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టుంది. గతంలో ఓటర్లు తాము ఓటు వేయాల్సిన పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ఇబ్బంది పడేవారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అంతగా లేకున్నా పట్టణ ప్రాంతాల్లో మాత్రం పోలింగ్ కేంద్రం వెతుక్కోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఈ ఇబ్బంది ఎందుకని కొందరు ఓటు వేయని సందర్భాలు కూడా ఉండేవి. ఈ సమస్య గుర్తించిన ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రం చిరునామా తెలుసుకునే విధానం సులభతరం చేసింది. ఓటరు తన ఓటు హక్కు ఎక్కడుందో ఇంటి దగ్గరి నుంచే తెలుసుకునేలా ఇంటర్‌నెట్ ద్వారా అవకాశం కల్పించింది.

ఇలా చూసుకోవాలి



- నెట్‌లో coe.telangana.nic.in పేజీలో లాగిన్ అవ్వాలి.
- సెర్చ్ యువర్ నేమ్ అనే అంశాన్ని ఎంపిక చేసుకుంటే అందులో అసెంబ్లీ, కౌన్సిల్ అనే రెండు అంశాలు కనిపిస్తాయి. దీనిలో అసెంబ్లీని ఎంపిక చేసుకోవాలి.
- ఒక వేళ వెబ్‌పేజీ హిందీలో కాని ఇంగ్లిష్‌లోకాని ఉంటే పై భాగంలో ఉన్న ట్రాన్స్‌లేట్ అంశాన్ని ఎంపికచేసి దానిలో మనకు నచ్చిన భాషను ఎంపికచేసుకుని కంటిన్యూ క్లిక్ చేయాలి.
- తర్వాత పేజీలో పేరు, ఇతర వివరాలు, రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం వంటి అంశాలను ఎంపిక చేసుకోవాలి.
- అంశాలు నింపిన తర్వాత వెబ్‌పేజీ కుడివైపు కిందిభాగంలో ఓ బాక్స్ అల్ఫాబెట్స్ అంకెలతో ఉంటుంది. వాటిని నమోదు చేయాలి.
- చివరగా సెర్చ్ బటన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే మీరు పైన నింపిన వివరాలతో పాటు మీ ఓటరు సంఖ్య, వేయాల్సిన పోలింగ్ కేంద్రం చిరునామా వస్తుంది.

భువనగిరిపై కాంగ్రెస్ జెండా..

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్

బచ్చన్నపేట: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరిపై కాంగ్రెస్ జెండా ఎగరడంతోపాటు తెలంగాణలో కాంగ్రెస్ రెండంకెల స్థానాలు గెలిచి చరిత్ర సృష్టిస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని గోపాల్ నగర్ చౌరస్తా నుంచి మండల కేంద్ర చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ దొందూదొందేనని, ఇంకా మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని తెలిపారు. ప్రచారంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి, కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, లక్ష్మీనారాయణ, మేక మల్లేషం, జంగిటి విద్యానాథ్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వేముల వెంకటేష్ గౌడ్, రమేష్, శ్రీనివాస్, ఎల్లయ్య, బాలకిషన్ గౌడ్, ఎంపీటీసీలు నల్లగోని పుష్ప, ఆల్వాల రాధ, మసూద్, టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంగా భవానీరెడ్డి, జనరల్ సెక్రటరీ బాలలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

ఆట..అభ్యర్థన

- జేఎన్ఎస్‌లో కావ్య ప్రచారం



ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న ఎమ్మెల్యే నాయిని, కావ్య

హన్మకొండ చౌరస్తా: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేడియంలో వాకింగ్ చేస్తూ ఓటు అభ్యర్థించారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో కాసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు.

అదనపు బ్యాలెట్ యూనిట్ల పరిశీలన



అదనపు ఈవీఎంలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య, వివిధ పార్టీల ప్రతినిధులు

వరంగల్: ఏనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌లో ఈసీఐఎల్ నుంచి అదనంగా వచ్చిన వెయ్యి బ్యాలెట్ యూనిట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఆధ్వర్యంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్లతో మొదటి దశ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ)నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానంలో 42 మంది అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో మూడు బ్యాలెట్ యూనిట్లు ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎలక్షన్ కమిషన్ ఈసీఐఎల్ నుంచి అదనంగా 1000 బ్యాలెట్ యూనిట్లు పంపగా మంగళవారం రాత్రి ఏనుమాముల మార్కెట్ యార్డులోని వేర్‌హౌస్ గోదాంకు చేరుకున్నాయి. వీటికి ఎఫ్ఎల్‌సీ పూర్తయిన తర్వాత రెండో ర్యాండమైజేషన్ నిర్వహించి జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ, తహసీల్దార్ ఇక్బాల్, డీటీ రంజిత్, కాంగ్రెస్, బీఎస్పీ, వైఎస్సార్సీపీ, టీడీపీ, ఎంఐఎం, స్వతంత్ర, రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజేష్, అనిల్ కుమార్, రజినీకాంత్, శ్యామ్, ఫైజుద్దీన్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులూ తస్మాత్ జాగ్రత్త!

ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా



భూపాలపల్లి అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలయ్యేలా ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు ఏర్పాటు చేసింది. ఓటర్లను నాయకులు ప్రభావితం చేసేలా ఏ పనులు చేసినా కఠినంగా వ్యవహరించనుంది. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం ప్రచారాలకు దూరంగా ఉండాలి. లేనట్లయితే ఎన్నికల సంఘం వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసింది. వీడియో సర్వేలెన్స్ స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ ప్రచార వీడియో రికార్డింగ్‌లను ఎన్నికల సంఘం పకడ్బందీగా చేయిస్తోంది. ఇలా చేసిన రికార్డింగ్‌ను పరిశీలన బృందం అధికారులు ఎప్పటికప్పుడు వీక్షిస్తుంటారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రచారంలో పాల్గొన్నట్లు గమనిస్తే ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో సంబంధిత అధికారులపై వేటు వేయడం లేదా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటారు. సామాజిక మాధ్యమాలను సైతం మీడియా మానిటరింగ్ బృందం అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. పార్టీలకు అనుకూలం, ప్రతికూలంగా పోస్టులు పెట్టినా ఎన్నికల చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుంది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే కారణంగా ఓ జిల్లాస్థాయి అధికారులపై ఎన్నికల సంఘం వేటు వేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ అధికారులు ప్రత్యక్షం, పరోక్షంగా ప్రచారంలో పాల్గొన్నట్లు లేదా ఏదైనా రాజకీయ పార్టీకి మద్దతుగా వ్యవహరించినట్లు ఆధారాలు లభిస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుంది. కేవలం కేటాయించిన విధులకు మాత్రమే అధికారులు పరిమితమైతే ఏ ఇబ్బందులు ఉండవు.

నిబంధనలు ఇవీ..

- ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచారాల్లో పాల్గొనకూడదు
- పార్టీల కండువాలు కప్పుకోవడం నిషేధం
- సామాజిక మాధ్యమాల్లో పార్టీలకు అనుకూలంగా పోస్టులు పెట్టకూడదు
- ఓటర్లను ఫలానా పార్టీకి ఓటు వేయాలని సూచనలు చేయకూడదు
- పార్టీల ప్రచారంలో ప్రత్యక్షం, పరోక్షంగానూ పాల్గొనవద్దు
- ఓటర్లను ప్రభావితం చేసేలా ఎలాంటి పనులు చేయకూడదు
- ఆధారాలు లభిస్తే మాత్రం చర్యలు తప్పవు

రూ.3.42 లక్షల నగదు పట్టివేత



కాజీపేట : కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎన్నికల అధికారులు రూ.3.42 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన లక్కాకుల నరేష్ ద్విచక్రవాహనంలో రూ.2,71,200 నగదు తరలిస్తూ పట్టుబడ్డారు. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన దుస్తుల వ్యాపారి మిట్టపల్లి రాకేష్ వద్ద రూ.70,800 నగదు లభించింది. ఈ నగదుకు ఎలాంటి ఆధారం చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని హనుమకొండ జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

భద్రకాళిని దర్శించుకున్న ఎన్నికల పరిశీలకులు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయాన్ని మంగళవారం ఎన్నికల పరిశీలకులు సందర్శించారు. వారిని అర్చకులు ఆలయమర్యాదలతో స్వాగతించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం చేశారు. దర్శించుకున్న వారిలో రక్షిత్‌రాజ్ ఐఏఎస్, ఉమాకాంత్ ఐఆర్ఎస్, రామ్‌కుమార్‌గోపాల్ ఐఆర్ఎస్ ఉన్నారు.

పోలీసులు వేధించారు..

- ఫిర్యాదు చేస్తే.. బైండోవర్ చేశారు
- బాధితుడి అదృశ్యం
- సీపీకి బాధితుడి భార్య ఫిర్యాదు



శ్యాంరావు ప్రశాంత్‌కుమార్

హసన్‌పర్తి: తన వద్ద అప్పుగా తీసుకున్న డబ్బు ఇప్పించాలని ఫిర్యాదు చేస్తే పోలీసులు తనను అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారని బాధితుడు తన సూసైడ్‌లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగపహాడ్‌కు చెందిన ముస్కు శ్యాంరావుప్రశాంత్‌కుమార్‌కు అదే గ్రామానికి చెందిన ముస్కు వీరేశం మధ్య ఆర్థికలావాదేవీల అంశంలో వివాదం నెలకొంది. దీంతో శ్యాంరావు ప్రశాంత్‌కుమార్ ఇరువై రోజుల క్రితం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు స్పందించలేదు. దీంతో గత నెల 27వ తేదీ నుంచి వరుసగా మూడు రోజులు 100 డయల్ చేశాడు. దీనిపై పోలీసులు స్పందించి విచారించారు. సివిల్ తగాదా కావడంతో కోర్టుకు వెళ్లాలని సలహా ఇచ్చారు. అయితే వివాదం తీవ్ర రూపం దాల్చుతోందని భావించిన పోలీసులు శ్యాంరావు ప్రశాంత్‌కుమార్‌ను తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు.

మానసిక వేదనకు గురై.. అదృశ్యం

పోలీసులు తనను అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచడంపై ప్రశాంత్‌కుమార్ మానసిక వేదనకు గురయ్యాడు. ఈ మేరకు సూసైడ్ నోట్ రాసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. పిల్లలను బాగా చదివించాలని, తల్లిదండ్రులు జాగ్రత్త అంటూ ఆ సూసైడ్ నోట్‌లో తెలుపుతూ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన ప్రశాంత్‌కుమార్ భార్య మాధవి బుధవారం సీపీకి ఫిర్యాదు చేసింది. తన భర్తను మానసికంగా వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

ఉద్యోగాల పేరిట మోసం.. నిందితుడి అరెస్టు



వరంగల్ క్రైం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గ్రూప్ -1 ఉద్యోగాలు పెట్టిస్తానని మోసం చేసి అమాయకుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం అదాలత్ జంక్షన్‌లో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా క్రైమ్ నంబర్ 599/2023లో నిందితుడిగా ఉన్న హైదరాబాద్, గచ్చిబౌలికి చెందిన పాలేపోగు బచ్చయ్య అలియాస్ బుచ్చిబాబుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. మార్చి 29న ఉద్యోగాల పేరుతో మోసం చేసి అరెస్టు అయిన కొత్త వీరేశం, పవన్‌కుమార్‌లతో కలిసి నిందితుడు బుచ్చిబాబు 2016 నుంచి 2021 వరకు గ్రూప్-1లో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికి అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. అలా వచ్చిన డబ్బులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి బతకాలని ప్రణాళిక రూపొందించుకుని, తన పేరిట ఆస్తులుంటే తెలుస్తుందని, భార్య, తమ్ముడి పేరిట వ్యవసాయ భూములు, ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఉద్యోగాల పేరుతో మొత్తంగా రూ.20కోట్ల వరకు వసూలు చేసినట్లు తేలిందన్నారు.

వడదెబ్బతో వ్యాపారి మృతి



రమేష్ (ఫైల్)

కమలాపూర్: కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన దుస్తుల వ్యాపారి పత్తిపాక రమేశ్ (55) వడదెబ్బకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రమేశ్ గత శనివారం కోరుట్లలో దుస్తులు అమ్ముతున్న క్రమంలో వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కోరుట్లలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు. మంగళవారం నిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బుధవారం రమేశ్ అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

జనగామలో కూలీ..



మొహినొద్దీన్ (ఫైల్)

జనగామ: జనగామ పట్టణం గుండ్లగడ్డకు చెందిన కూలీ మహ్మద్ మోహినొద్దీన్ (52) వడదెబ్బతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. మంగళవారం కూలీ పనికి వెళ్లిన మొహినొద్దీన్ వడదెబ్బతో అస్వస్థతకు గురై ఇంటికి వచ్చి కుప్పకూలాడు. కుటుంబీకులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

ముడుపుగల్‌లో వృద్ధుడు..



నారాయణ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామానికి చెందిన మెరుగు నారాయణ (75) వడదెబ్బతో మృతిచెందాడని స్థానికులు, కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్..



రజనీకాంత్ (ఫైల్)

గీసుకొండ: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన ఆటో డ్రైవర్ గోదాసి రజనీకాంత్(28) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో రజనీకాంత్ ఏప్రిల్ 24న పురుగుల మందు తాగాడు. దీంతో అతడి కళ్లు పచ్చగా మారడంతో అనుమానం వచ్చి అదే నెల 29న ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ 30న రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ ఎల్. పవన్‌కుమార్ తెలిపారు.

నేలకొరిగిన 'విప్లవ' కెరటం

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు సుష్మిత మృతి
- సూదన్‌పల్లిలో విషాదం



సుష్మిత (ఫైల్)

హసన్‌పర్తి: ఓ విప్లవ కెరటం నేలకొరిగింది. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా టెక్మెట్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు సుష్మిత మృతి చెందింది. హసన్‌పర్తి మండలం సూదన్‌పల్లికి చెందిన తిక్క సుధాకర్‌కు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు సుష్మిత(25) విద్యార్థి దశలోనే అడవి బాట పట్టింది. అప్పుడు సుష్మిత వయసు 17 ఏళ్లు. ఇంటర్ చదువుతున్న సమయంలోనే సుష్మిత అలియాస్ చైతన్య అలియాస్ చైతు విప్లవ సాహిత్యానికి ఆకర్షితురాలైంది. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతానని తన సమీప బంధువుల ద్వారా అడవి బాట పట్టింది. కాగా, 2016లో ఒకే సారి ఆరుగురు మావోయిస్టు పార్టీలో చేరారు. ఇందులో సూదన్‌పల్లికి చెందిన సుష్మిత, చింతగట్టుకు చెందిన బూర రాము తోపాటు మరో నలుగురు అడవి బాటపట్టారు. అయితే ఇందులో ఇద్దరు రెండేళ్ల తిరగకముందే జనజీవన స్రవంతిలో కలిశారు.

నలుగురిపై రెక్కీ..

మావోయిస్టు పార్టీలో చేరిన ఆరు నెలలకే ఆరుగురు మావోయిస్టులు నగరానికి చెందిన నలుగురిపై రెక్కీ నిర్వహించారు. అప్పటి కార్పొరేటర్లు దాస్యం విజయ్‌భాస్కర్, కాగితపు సమ్మిరెడ్డి, పెగడపల్లి మాజీ సర్పంచ్ నరెడ్ల శ్రీధర్, ప్రస్తుత హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్న బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డిని హతమార్చడానికి రెక్కీ నిర్వహించారు. రెండుసార్లు ఉదయ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ ఇంటి వద్ద మాటు వేశారు. అయితే వారు తప్పించుకున్నారు.

పోయినప్పటి నుంచి..

సుష్మిత అడవి బాట పట్టినప్పటి నుంచి ఇంటికి రాలేదు. ఆమె తిరిగి వస్తుందని కుటుంబీకులు ఎదురూ చూస్తూనే ఉన్నారు. చివరికి శవమై ఇంటికి తిరిగి వస్తోందని బంధువులు రోదిస్తూ చెప్పారు.

సూదన్‌పల్లిలో విషాదం..

సుష్మిత ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు తెలియడంతో సూదన్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కూతురు మృతితో ఆ కుటుంబం రోదనలు ఆకాశనంటాయి.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

> వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళ, బుధవారాల్లో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ఖిలా వరంగల్: ఆర్థిక కారణాలతో మనస్తాపానికి గురైన ఓ ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన వరంగల్ శంభునిపేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శంభునిపేటకు చెందిన మహ్మద్ అబ్జల్ (35), కమ్రీన్ సుల్తానా దంపతులకు ఒక కుమార్తె కుమారుడు ఉన్నారు. మహ్మద్ అబ్జల్ ఓ ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. వచ్చే వేతనంతో కుటుంబ పోషణ గడవక కొంతకాలంగా ఆ కుటుంబ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మహ్మద్ అబ్జల్ బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేయగా.. హెడ్ కానిస్టేబుల్ యాదగిరి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు హైమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

కోరిన వ్యక్తితో పెళ్లి కాదేమో అని యువతి..

గీసుకొండ: సమీప బంధువుతో తన వివాహం చేయడానికి పెద్దలు నిర్ణయించగా, ఆ తర్వాత సదరు యువకుడి బంధువులు నిరాకరించడంతో ఓ యువతి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి కథనం ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా వినుగొండ గ్రామానికి చెందిన పోలెపోగు రంజిత్‌కుమార్, పద్మ దంపతులు తమ ఇద్దరు ఆడపిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం వలస వచ్చి గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ రెడ్డిపాలెంలోని పోగుల కృష్ణారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో కిరాయికి ఉంటున్నారు. ఈ క్రమంలో రంజిత్‌కుమార్ రెండో కూతురు నాగజ్యోతి(18) వివాహం తన మేనబావ కుమారుడు రాజుతో చేయడానికి రెండేళ్ల క్రితం రెండు కుటుంబాలు నిర్ణయించాయి. తాజాగా రాజు తల్లిదండ్రులు నాగజ్యోతితో అతడి వివాహం చేయడానికి నిరాకరించారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని (తల్లిదండ్రులు ఊరికి వెళ్లిన) సమయంలో నాగజ్యోతి ఏప్రిల్ 30న సాయంత్రం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ ఎల్. పవన్‌కుమార్ బుధవారం తెలిపారు.

రైలు కిందపడి యువకుడు..



తేజశ్వర్ (ఫైల్)

కాశిబుగ్గ : దంపతుల మధ్య గొడవల కారణంగా మనస్తాపానికి గురైన భర్త రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన కొంగర తేజశ్వర్(27) నగరంలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. 2021లో రమ్యను కులాంతర వివాహం చేసుకున్నాడు. దంపతులకు సంవత్సరం వయసు ఉన్న కుమార్తె ఉంది. ఈ క్రమంలో కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం కేయూ పీఎస్‌లో, ఒక్క రోజు క్రితం మహిళా పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా మళ్లీ మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన తేజశ్వర్ ఇంటి నుంచి బయటకు వచ్చి మెడికేర్ హాస్పిటల్ సమీపంలో గల రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. రాత్రి 11 గంటల సమయంలో వాట్సాప్ స్టేటస్‌లో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని పెట్టి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కె భాస్కర్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి తండ్రి రవీందర్‌కు అప్పగించామని సీఐ నరేష్ తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్‌రావు

డోర్నకల్: మండల కేంద్రంలో పోలీసులు రూ.3.88 లక్షల విలువైన ఎండ గంజాయి పట్టుకున్నారు. బుధవారం డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో సీఐ బి. ఉపేందర్‌రావు వివరాలు వెల్లడించారు. ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి రెండు బ్యాగులతో కనిపించాడు. పట్టుకుని తనిఖీ చేయగా రూ.3.88 లక్షల విలువైన 19.4 కేజీల ఎండు గంజాయి లభించింది. పట్టుబడిన వ్యక్తి ఒడిశాలోని కందమల్ల జిల్లా కేలపడ గ్రామానికి చెందిన బిజియా దిగల్‌గా గుర్తించారు. బిజియా స్వగ్రామంలో గంజాయిని కేజీ రూ.4 వేల చొప్పున కొనుగోలు చేసి మహారాష్ట్రలో రూ.20 వేల చొప్పున విక్రయిస్తున్నాడు. గంజాయితో కోనార్క్ ఎక్స్‌ప్రెస్‌లో షోలాపూర్‌కు వెళ్తున్నాడు. రైలులో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో డోర్నకల్‌లో దిగి పోలీసులకు పట్టుబడ్డాడు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'నిశ్శబ్ద లయలు' పుస్తకానికి అరుదైన గుర్తింపు



శిరీష శ్రీభాష్యం



నిశ్శబ్ద లయలు పుస్తకం కవర్‌పేజీ

హన్మకొండ కల్చరల్ : హనుమకొండకు చెందిన కవి, ఉపాధ్యాయురాలు శిరీష శ్రీభాష్యం రచించిన 'నిశ్శబ్దలయలు' కవితాసంపుటికి అరుదైన గుర్తింపు లభించింది. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన భారతీయ గ్రంథాలయ సంస్థ రాజారామ్మోహన్‌రాయ్ ఫౌండేషన్ కోల్‌కతా పుస్తక పథకానికి 2021-22 సంవత్సరానికిగాను శిరీష కవితాసంపుటి ఎంపికైంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రజాగ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసాచారి ఎంపిక లేఖను శిరీషకు పంపారు. ఈ సందర్భంగా సాహిత్య, విద్యారంగానికి చెందిన పలువురు శిరీషకు అభినందనలు తెలిపారు.

ఫార్మసీ పరీక్షల్లో 22 మంది బుక్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో బీఫార్మసీ ఆరో సెమిస్టర్, ఫార్మ్‌డీ మూడో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం పారంభమయ్యాయి. కేయూ ఫార్మసీ కళాశాల పరీక్ష కేంద్రంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షలను స్క్వాడ్ తనిఖీ చేశారు. బీఫార్మసీ పరీక్షల్లో 16 మంది, ఫార్మ్‌డీ పరీక్షల్లో ఆరుగురు మొత్తం 22 మంది విద్యార్థులను మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ చేశారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు.

ఫార్మసీ కళాశాలను సందర్శించిన రిజిస్ట్రార్

యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బుధవారం సందర్శించారు. వివిధ విభాగాలను తనిఖీ చేశారని తెలిసింది.

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. సమావేశంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు మూడు జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు సమావేశమై కార్యాచరణ గురించి చర్చించారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ పక్షాన తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూకి నిధులివ్వకుండా బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓయూకు కేసీఆర్ చేసింది శూన్యమని, ఉస్మానియా భూములు అమ్ముకున్నారని మండిపడ్డారు. గతంలో 1,200 మంది అధ్యాపకులు ఉంటే ప్రస్తుతం 320 మంది ఉన్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ లావాదేవీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఓయూలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉన్నా.. ఒక్క రోజు కూడా పట్టించుకోలేదన్నారు. ఓయూ వందేళ్ల ఉత్సవాల్లో భారీగా అవినీతి జరిగిందని, ఉత్సవాల కాంట్రాక్టు కేటీఆర్ సన్నిహితులకు ఇచ్చారని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు కేటీఆర్ అనుమతిచ్చి విద్య దోపిడీకి పాల్పడ్డారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు ● మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ ఆలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.

పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత



ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

పదిలో 8 మంది గుర్తింపు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నారాయణపూర్ జిల్లాలోని టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలను బస్తర్ పోలీసులు బుధవారం ప్రకటించారు. మొత్తం పది మంది చనిపోగా ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. మృతుల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య అలియాస్ జోగన్న ఆలియాస్ జిను(66), కాసరబోయిన వినయ్ (చెన్నూరు, మంచిర్యాల జిల్లా), సుస్మితా అలియాస్ చైతే (వరంగల్), సంగీత అలియాస్ ఆత్రం డోగే (జోగన్న భార్య, అహేరి, గడ్చిరోలి జిల్లా, మహారాష్ట్ర), సురేశ్ (పశ్చిమ బస్తర్), మల్లేశ్ అలియాస్ మడకం ఉంగా (బస్తర్), పాడి యం కోషి (చింతగుప్ప, సుక్మా), కమ్లీ (కిష్టారం, సుక్మా జిల్లా)లు ఉన్నారు. కాగా, జోగన్న ప్రస్తుతం స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఇతనిపై 196 క్రిమినల్ కేసులు నమోదు అవగా రూ.25 లక్షల రివార్డు ఉంది.

పర్యావరణ ప్రతిభా అవార్డులకు పీసీబీ దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో ప్రతిఏటా అందించే పర్యావరణ ప్రతిభ అవార్డులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధం, నీటిపొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఈ అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ దరఖాస్తులను సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ పర్యావరణ విద్యా విభాగంలో ఈ నెల 15 లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91773 03127 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

7న బీసీ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

- ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీ సమస్యలపై చర్చించి, ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధానాలపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మే 7వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జాతీయ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు బీసీలకు ప్రభుత్వంలో వాటా ఇవ్వకుండా కేవలం ఓటు వేసే వ్యక్తులుగానే చూశాయని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని పాలక పార్టీలకు తెలిసివచ్చేలా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కార మయ్యేలా చూడాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

ఆ ఈవీఎంల వినియోగానికి హైకోర్టు ఓకే

- మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు.. లోక్‌సభ ఎన్నికల్లో వాడుకునేందుకు ఈసీకి అనుమతి
- మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వజ్రేష్‌యాదవ్ పిటిషన్
- విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మల్లారెడ్డి, కాంగ్రెస్ తరఫున వజ్రేష్‌యాదవ్ పోటీ చేశారు. 33 వేల మెజారిటీతో మల్లారెడ్డి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో మల్లారెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని.. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలన్నీ ఇవ్వలేదని ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ వజ్రేష్ యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సమీప అభ్యర్థి అయిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వజ్రేష్ తరఫున న్యాయవాది సిర్థ పోగుల దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్, మేడ్చల్ ఆర్డీవో, అసెంబ్లీ కార్యదర్శి, మల్లారెడ్డితో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అయితే కేసు కారణంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వాడుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమీప ప్రత్యర్థినైన తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై కూడా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వాదన తర్వాత.. రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 14కు వాయిదా వేశారు.

దిశ కేసులో పోలీసులకు ఊరట

సిర్పుర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలపై హైకోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్యకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ, విచారణను జూలై 10కి వాయిదా వేసింది.

ఆ నివేదిక సరిగా లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు

- 2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పుర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అయితే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక సరిగా లేదని, దాని ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ సహా పలువురు పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టును ఆశ్రయించారు.

అప్పటివరకు చర్యలొద్దన్న హైకోర్టు

ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. కాగా, 'దిశ' ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలుప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

ఎన్పీడీసీఎల్ సీజీఎం హెచ్ఆర్‌డీగా మధుసూదన్



మధుసూదన్‌ను సన్మానిస్తున్న అధికారులు

హన్మకొండ : టీఎస్ ఎన్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ హెచ్ఆర్‌డీగా టి.మధుసూదన్‌ను నియమిస్తూ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హెచ్ఆర్‌డీ సీజీఎంగా పనిచేస్తున్న ప్రభాకర్ ఏప్రిల్ 30న పదవీ విరమణ చేశారు. ఐపీసీ అండ్ రాక్ సీజీఎంగా పనిచేస్తున్న టి.మధుసూదన్‌ను హెచ్ఆర్‌డీ సీజీఎంగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను జీఎంలు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మల్లికార్జున్, డీఈలు అమర్నాథ్, భాస్కర్, చంద్రశేఖర్, ఏఓ బుచ్చిరెడ్డి, ఏఈ శ్రీపాల్ పాల్గొన్నారు.

కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

రామన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. వరంగల్ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన నగరంలోని వైశ్య ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో వైశ్యుల జీవితాలు బాగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తోనుపునూరి వీరన్న, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరు మధు, గుమ్మడవెల్లి సురేష్, జిల్లా ఇన్‌చార్జ్ బిజ్జాల శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు శైలజ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న క్రీడాకారులు!

- స్పోర్ట్స్ హాస్టల్‌లో ఏటా ఇదే పరిస్థితి
- అకాడమీ నిర్వహణపై నిర్లక్ష్యం?

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కొనసాగుతున్న వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. హాస్టల్‌లో ఉంటూ.. క్రీడల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల సంఖ్య రోజు రోజుకూ పడిపోతోంది. తగ్గుతున్న క్రీడాకారుల సంఖ్యపై సమీక్ష జరిపి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన క్రీడాల అధికారులు ఆ దిశగా కనీస ప్రయత్నాలు చేయకపోవడం బాధాకరం.

అరకొరగా క్రీడాకారుల అడ్మిషన్లు

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో దాదాపు రెండు దశాబ్దాలకు పైగా.. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆవరణలో వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ కొనసాగుతోంది. 118 మంది క్రీడాకారుల సామర్థ్యం గల ఈహాస్టల్‌లో ప్రవేశాలకు ప్రతీ విద్యా సంవత్సరంలో బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుంటారు. హాజరైన బాలబాలికలకు ప్రాథమిక క్రీడా పరీక్షలు నిర్వహించి హాస్టల్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. గత ఐదేళ్లలో ఏ ఒక్క సంవత్సరం కూడా పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదు.

బ్యాటరీ టెస్ట్..

స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు 4, 5వ తరగతులు చదువుతున్న (9–10 సంవత్సరాల) బాలబాలికలు అర్హులు. ప్రతీ విద్యా సంవత్సరంలో హాస్టల్ అడ్మిషన్ల కోసం స్టేడియంలో బాలబాలికలకు బ్యాటరీ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో ముఖ్యంగా 800 మీటర్ల సాధారణ రన్నింగ్, 30 మీటర్ల స్పీడ్ రన్నింగ్, మెడిసిన్ బాల్ (1కేజీ) త్రో, 6 ఇంటూ 10 మీటర్ల షటిల్ రన్, ఎత్తు 135 సెంటీమీటర్ల నుంచి 141 సె.మీ వరకు, బరువు 30 కేజీల పైన ఉండాలి. ఫ్లెక్సిబిలిటీ, వర్టికల్ జంప్, స్టాండింగ్ బ్రాడ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు హాస్టల్‌లో ప్రవేశం కల్పిస్తారు.

మూడు అకాడమీల్లో తగ్గుతున్న క్రీడాకారులు

వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రస్తుతం మూడు అకాడమీలు కొనసాగుతున్నాయి. అందులో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో బాలబాలికలు శిక్షణ పొందుతున్నారు. కాగా ప్రభుత్వం ఒక్కో క్రీడాకారుడికి ప్రత్యేక డైట్ కోసం 180 రూపాయలు ఖర్చు చేస్తుంది. ఆయా క్రీడాకారులకు డీఎస్ఏ ఆధ్వర్యంలో నియమితులైన ప్రత్యేక కోచ్‌లు శిక్షణ అందిస్తారు. కాగా.. మూడు అకాడమీల్లో క్రీడాకారుల సంఖ్య గత ఐదేళ్లుగా తగ్గుతూ వస్తోంది.

గణనీయంగా తగ్గుతున్న బాలికలు..

వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాల్లో గత ఐదేళ్లలో బాలికల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. తల్లిదండ్రుల్లో బాలికల భద్రతపై అనుమానం, అధికారుల పర్యవేక్షణపై ఆరోపణలే కారణంగా పలువురు సీనియర్ క్రీడాకారులు చెబుతున్నారు. బాలబాలికలకు వేర్వేరుగా వసతి సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ బాలికల తల్లిదండ్రుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు క్రీడాధికారులు తీసుకున్న చర్యలు శూన్యమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హాస్టల్‌లో క్రీడల వారీగా క్రీడాకారుల సంఖ్య

వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో 2018 నుంచి 2024 వరకు క్రీడాకారుల వివరాలు

విద్యా సంవత్సరం	క్రీడలు	బాలురు	బాలికలు	మొత్తం
2018–19	అథ్లెటిక్స్	25	24	121
	జిమ్నాస్టిక్స్	34	23	
	హ్యాండ్‌బాల్	15	--	
2019–20	అథ్లెటిక్స్	23	21	109
	జిమ్నాస్టిక్స్	29	20	
	హ్యాండ్‌బాల్	16		
2020–21	అథ్లెటిక్స్	23	21	109
	జిమ్నాస్టిక్స్	29	20	
	హ్యాండ్‌బాల్	16		
2021–22	అథ్లెటిక్స్	19	17	94
	జిమ్నాస్టిక్స్	25	18	
	హ్యాండ్‌బాల్	15		
2022–23	అథ్లెటిక్స్	22	11	75
	జిమ్నాస్టిక్స్	13	15	
	హ్యాండ్‌బాల్	14		
2023–24	అథ్లెటిక్స్	19	11	76
	జిమ్నాస్టిక్స్	18	16	
	హ్యాండ్‌బాల్	12		



హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం

హకీంపేటకు ప్రాధాన్యమిస్తున్నారు..



నేను హనుమకొండ క్రీడల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఐదేళ్లుగా హాస్టల్‌లో సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నా. అయితే హైదరాబాద్‌లోని హకీంపేటలో స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు హాస్టల్ వసతి ఒకే చోట ఉండడం వల్ల పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇస్తున్నారు. వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో కేవలం వసతి ఉండడం, స్కూల్‌కు మరో చోటుకు వెళ్లాల్సి రావడంతో ఇక్కడికి పిల్లలను పంపేందుకు ఆసక్తి చూపడం లేదు.

– జి.అశోక్, డీవైఎస్ఓ, హనుమకొండ

విద్యుత్ ప్రమాదాలు.. తస్మాత్ జాగ్రత్త

- 7వ తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు
- సదస్సులు, కరపత్రాల ద్వారా టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రచారం



హన్మకొండ: వేసవిలో విద్యుత్ ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయి. అప్రమత్తంగా ఉంటే వీటిబారి నుంచి రక్షించుకోవచ్చని ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు. కాగా, ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సర్కిల్ పరిధిలో సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని, కరపత్రాల ద్వారా ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని ఇప్పటికే చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- రైతులు వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినప్పుడు కరెంట్ మోటార్లు, ఫుట్ వాల్వ్‌లు, సర్వీస్ వైర్లకు ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకే రైతులు విద్యుత్ మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వ్‌లను ఏమరపాటుతో తాకొద్దు. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి. ఎర్త్ చేయబడని పరికరాల వల్లే విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయి. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జి.ఐ. పైపులు, ఫుట్ వాల్వ్‌లు తాకడం అత్యంత ప్రమాదకరం.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, మరమ్మతులు చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- ఫేజ్ కన్వర్టర్ వినియోగం నిషేధం, శిక్షార్హులు. మోటారు, పంపుసెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సొంతంగా సరిచేద్దామని ప్రయత్నిస్తే ప్రాణనష్టం/హాని జరగొచ్చు. తెలిసిన వారితోనే మరమ్మతులు చేయించాలి. వ్యవసాయ నిమిత్తం, గృహాల్లో అతుకులు లేని సర్వీస్ వైర్ మాత్రమే ఉపయోగించాలి.
- కరెంట్ లైన్ల కింద పందిళ్లు వేసి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విద్యుత్ తీగలు అమర్చి చేపలు పట్టడం వల్ల షాక్ గురై పలువురు చనిపోతున్నారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వినియోగించొద్దు.
- బోరు వేసే సమయంలో, బోరు పైపులు తీసివేసే సమయంలో పైనుంచి వెళ్లే విద్యుత్ తీగలు తాకి చనిపోతున్నారు. బోర్లు వేస్తున్న క్రమంలో పైన విద్యుత్ తీగలు ఉన్నాయో లేదో పరిశీలించి జాగ్రత్తలు పాటించాలి. జెండా ఎగుర వేసే సమయంలో ఆ జెండా పైపులు విద్యుత్ తీగలకు తాకకుండా జాగ్రత్త వహించాలి.
- వరి కోతల సమయంలో హార్వెస్టర్లు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. అలా జరగకుండా జాగ్రత్త వహించాలి
- విద్యుత్ తీగలు భూమిపై తీసుకెళ్లడం ద్వారా బాటసారులు ఆ తీగలు చూడకుండా విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారు. భూమి పై నుంచి విద్యుత్ తీగలు వేయొద్దు.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడం వల్ల షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ తీసి మాట్లాడాలి.
- కొన్ని చోట్ల జంతువుల నుంచి పంట రక్షణ కోసం విద్యుత్ ఫెన్సింగ్ వేస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. పంట చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ఉన్నచోట జాగ్రత్త చాలా అవసరం.. అటు వైపు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి. పొలాలకు విద్యుత్ కంచెలు వేయొద్దు.
- దండెం తీగలను విద్యుత్ తీగలతో కలపొద్దు. సపోర్ట్‌గా ఇన్సులేటెడ్ జి.ఐ వైర్లను ఉపయోగించాలి. ఇంటి వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ చేయాలి. నాణ్యమైన ప్లగ్గులు, సెల్‌ఫోన్ల చార్జర్లు వాడాలి.
- వర్షాలు కురిసిన సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాల స్టే వైరు/సపోర్టు వైరును, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకొద్దు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలపాలి.
- ఎవరికైనా పొరపాటున కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలనే ఆతృతలో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోవద్దు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను వాడాలి.
- గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్ర స్థాయి విద్యుత్ సిబ్బంది లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్‌ను సంప్రదించాలి.
- విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు తెలుపడానికి టోల్ ఫ్రీ నంబరు.1800 425 0028 కు లేదా 1912కు ఫోన్ ద్వారా తెలపాలి.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి నేడు నోటిఫికేషన్

- నేటి నుంచి 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన నోటిఫికేషన్ విడుదల చేసి వెంటనే నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన ఆర్‌ఓగా ఉన్నారు. 13వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణకు ములుగు జిల్లా అదనపు కలెక్టర్‌ను నియమించారు. నల్లగొండ కలెక్టర్ అందుబాటులో లేని సమయంలో ఆయన అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 10న నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. 13వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి గడువు. అదే రోజు బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారు. 27వ తేదీన పోలింగ్ జరగనుంది. జూన్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కాగా, వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లా పరిధిలో 4,61,806 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 9న తుది జాబితా ప్రకటించనున్నారు.


బీజేపీలో చేరిన కార్పొరేటర్



కల్పన, నవీన్ దంపతులకు కండువా కప్పుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్ అర్బన్ : నగరంలోని 28 డివిజన్ కార్పొరేట్ గందె కల్పన, నవీన్ దంపతులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర నేతలు చాడ శ్రీనివాస్‌రెడ్డి, కుసుమ సతీష్ ఉన్నారు.

అనంత పద్మనాభరావుకు సహృదయానుబంధ పురస్కారం



హన్మకొండ కల్చరల్ : వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ప్రతి సంవత్సరం ద్విశతావధాని స్వర్గీయ డాక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ స్మారకంగా అందిస్తున్న సహృదయానుబంధ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ప్రసారభారతి అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావుకు అందజేస్తున్నామని సహృదయ అధ్యక్షులు గన్నమరాజు గిరిజామనోహర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న కవితాప్రసాద్ జయంతి రోజున హనుమకొండలో నిర్వహించనున్న కార్యక్రమంలో అందజేయనున్నట్లు తెలిపారు.